# నా అనుభవం ★

రచన:
శ్రీ అండవిల్లి కొండలరావు

ప్రతీ వ్యక్తి జీవితంలోనూ ఏదో ఒకనాడు మంచి సంఘటన జరిగితీరుతుంది. అది మంచైనా కావచ్చు' చెడుగైనా కావచ్చు.

నా అనుభవాల్లో మంచి సంఘటన గూర్చి యిప్పుడు మనవి చేస్తున్నా!

నేను ఆ రోజుల్లో కాలేజీ చదువు కొనసాగిస్తూ వచ్చాను. అది ఫైనల్ యియర్ కావడంచేత యెంతో శ్రద్ధగా చదువుతూ వుండేవాణ్ణి.

అప్పటి కప్పుడే నాలో యౌవ్వనం ప్రవేశించిందేమో అందమైన అమ్మాయిలను చూసేసరికి నాలో తీయతీయని భావాలు చెలరేగుతూ వుండేవి.

రాత్రులవేళ సమంగా నిద్ర పట్టేది కాదు. యెంత వేగంగ యీచదువైపోతుందా, ఎటువంటి సుందరాంగిని పెళ్ళిచేసుకోవాలా అన్న ఆలోచన్లో సతమత మౌతూ వుండేవాణ్ణి. ఇలా కొంతసేపు ఆలోచన్లు చేసి తిరిగి గ్రంథపఠనంలో లీనమయ్యేవాడిని.

నేను కాలేజీకి పోతుండే త్రోవలోనే ఓ యింటిముందొక నవయౌవ్వన సుందరాంగి యొకత్తె వయ్యారంగ నిల్చుండి నావైపు క్రీగంటి వీక్షణాలను విసురుతూ వుండేది.

అబ్బ! ఆమె అందం యేమని వర్ణించను! తుమ్మెదలా నల్లగ నిగనిగలాడే ఆమె శిరోజాలు విశాలమైన నుదురు, మీనములవంటి కండ్లు పద్మంలా వుండే ముఖం, దొండపండులా మెత్తని యెఱ్ఱని పెదవులు, మొదలైన యీ లక్షణాల్తో ఆమె ఒక శిల్ప సుందరిలా అక్కడ నిల్చుండేది.

ఒకనాడు అనుకోకుండ అప్రయత్నంగ ఆ త్రోవగుండా పోతూ ఆమెవైపు చూసాను. ఆ అమ్మాయి కూడ నావైపు క్రీగంటచూపు చూసింది. మా యిద్దరి చూపులూ కలుసుకున్నాయి. ఆమె తన మల్లెపువ్వులా తీర్చి దిద్దివున్న తెల్లని పండ్లవరస అగుపడేటట్టు మందహాసం చేసేది. అనుకోకుండా నాక్కూడ నవ్వు వచ్చేసింది.

ఇహ రాత్రులవేళ ఆ అమ్మాయిగురించే ఆలోచిస్తూ వేడివేడి నిట్టూర్పులు విడిచేవాణ్ణి. నిద్ర పట్టక యిటటూ దొర్లుతుండేవాడను.

ఆ మరునాడుదయం నేను కాలేజీకి వెళ్తుంటే ఆ అమ్మాయి తండ్రి నన్ను పిలిచాడు. నేను కొంప మునిగిందిరా భగవాన్ అనుకుంటూ భయపడ్తూనే అతని దగ్గరకు వెళ్ళాను. ఆయన నన్ను యెగాదిగా చూసి 'మీరేనా రావుగారు?' అని ప్రశ్నించాడు. అదే అన్నట్టుగ నేను తలూపేను. 'ఎక్కడ చదువుతున్నారు!' తిరిగీ ప్రశ్నించాడాయన. నా అనుమానం దాంతో మరీ యెక్కువైంది. నా 'కేరెక్టర్' గురించి మా 'ప్రిన్సిపాల్' గారితో చెప్పి నన్ను 'డిస్మిస్' చేయించివేస్తాడేమోనని భయపడ్తూ 'ఓ యేడుకొండలవాడా! వెంకటరమణమూర్తీ! తర్వాత నీ కొండకొచ్చి నీ దర్శనం చేసుకుంటా గానీ ముందీ యాపద గట్టెంచు. నాకెట్టి ఆపదా రాకుండా చెయ్యి మహాప్రభో!' అంటూ మనస్సులో భగవంతుణ్ణి ధ్యానిస్తూ నా కాలేజీపేరు నేనేం చదువుతున్నదీకూడ ఆయన్తో చెప్పాను.

'శుభం నాయనా! నీవంటి బుద్ధిమంతులూ చురుకైన వార్ని చూస్తుంటే నాకు ముచ్చటేస్తుంది. నీతో చిన్న విషయం చెప్దామని పిలిచాను. నువ్వు కాదనకుండ యివాళ సాయంకాలంనుంచీ మా అమ్మాయి సరోజకు హిందీ చెప్తుండు నాయనా! నీకు నెలకూ రూ 8-0-0 లు ఇస్తుంటాను. అత్తారింటికి వెళ్ళేవరకూ కొంతైనా హిందీ నేర్చుకోవాలని ముచ్చట పడ్తూ వుంది. ఏమంటావు నాయనా? మా అమ్మాయికి చెప్పడానికి నీ కిష్టమేనా?' అని అన్నాడు.

'రక్షించావురా భగవాన్' అని నాలో నేననుకొని ఆయన్తో యిలా అన్నాను.

'మీ అమ్మాయికి హిందీ చెప్పడానికి నాకేమీ అభ్యంతరం లేదుకానండీ యిది నా ఫైనల్ యియర్ కదా అని ఆలోచిస్తున్నాను.'

(తరువాయి 19 వ పేజీలో)

(10 వ పేజీ తరువాయి)

'నిజమే! ఐనా యేదోవిధంగ ఓ పావుగంటైనా తీరుబడి చేసుకొని వచ్చిపోతుండు.'

'పెద్దవారు. మీమాట కాదనలేకపోతున్నాను సాయంకాలం నుంచీ వస్తాన్లెండి.' అని చెప్పి కాలేజీకి వెళ్ళిపోయాను. ఆ సాయంత్రం మొదలూ రోజూ ఆ అమ్మాయికి హిందీ పాఠాలు చెప్తూ వచ్చాను. ఇంతవరకూ మాలో యే భావమూ బయటకు వెల్లడి కానీయలేదు. పాఠాలు సక్రమంగానే కొనసాగిపోతూ వున్నాయ్!

* * *

ఆ రోజు ఆదివారం కావడంచేత కాలేజీకి శలవు. సాయంకాలం మామ్మూలుకంటె ముందుగానే 'టాయ్‌లెట్' అయి ఆ యింటికి వెళ్ళాను. నేనూ వెళ్ళగానే ఆ అమ్మాయి అప్పటికే రతీదేవిలా ముస్తాబయి పుస్తకాలు పెట్టుకొని చాపమీద కూర్చుంది. నేను కూర్చుని ఆ వేళ చెప్పబోయే పాఠంగల పుస్తకం తీసిచూస్తున్నా. 'ఇప్పుడే వస్తాను మాస్టరుగారూ!' అంటూ ఆమె లోపలికి వెళ్ళి వెండి గ్లాసుతో కాఫీ పట్టుకొచ్చింది.

'కాఫీ పుచ్చుకోండి మాస్టరుగారూ! అంటూ ఆమె గ్లాసు నాచేతికి అందించింది. నేను ఆ కాఫీ అందుకోబోతుండగ నాచెయ్యి ఆమె చెయ్యీ కలిసింది. ఎన్నడూ ఆడదాని స్పర్శ తెలియని నాకు, ఆమెచేయి తగలగానే నా వొళ్ళు గగుర్పాటు చెందింది. ఆమెకూడ మత్తెక్కిన కళ్ళతో నావైపు చూసింది. నేనుకూడ అపేక్షతో ఆమె వైపు చూసాను. ఇద్దరమూ చిన్నగ నవ్వుకున్నాం.

ఆమెకు ఆమధ్య హిందీ 'మధ్యమ' పరీక్ష లయ్యాయి. ఆ పరీక్షలో సరోజ ప్రప్రథమంగ అందరికంటె ఫస్టు మార్కు సంపాదించింది. సరోజ తండ్రి నాకు బంగారుంగరం చేయించి బహుమతిగా యిచ్చాడు. సరోజ నూటురూపాయలుపెట్టి వెస్టు అండ్‌కో వాచీ కొని ప్రేమ చిహ్నంగ యిచ్చింది. సెలవు లిచ్చేసేరు. పేపర్లు చాలా ఉత్సాహంతో బాగానే వ్రాసాను. అంతటితో నా చదువు ముగిసింది. పరీక్ష ప్యాసయినవెంటనే ఉద్యోగంలో

CONCESSION
for High Class Watches

5 సంవత్సరములు గ్యారంటి, 15 దినములుమాత్రమే. ఆర్డరుతో, సిగరెట్ లైటర్, ఫౌంటెన్ పెన్



జర్మన్ అలారం (రేడియం ఉన్నది) రూ 15/=.

మంచి క్వాలిటి రూ 18/=.



ప్యాకెట్ వాచ్ (రేడియో డయిల్స్)రూ 14/= వాటర్ ప్రూఫ్ సైజు, 15జుయెల్స్ 38/= 17 జుయెల్స్ రూ 40/=. 21జుయెల్స్ రూ 60/=.





రోల్డ్ గోల్డు సైజు 5 జుయెల్స్ రూ 22/=
15 జుయెల్స్ రూ 30/=. 17 జుయెల్స్ రూ 38/=

రోల్డ్ గోల్డు సైజు 5 జుయెల్స్ రూ 35/=. 15 జుయెల్స్ రూ 38/=. 17 జెంట్స్ జుయెల్స్ రూ 40/=.

5 రూ అడ్వాన్సుతో ఆర్డరు పంపవలెను.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో.

Correspondence in English.

CALCUTTA WATCH CO (Sec 226).
Post.Box No- 12203 Calcutta 5.

ప్రవేశించాలి. సరోజ–వాళ్ళనాన్నగారు శెలవుల నన్నాళ్ళు నన్ను వాళ్లింట్లో వుండిపోమన్నారు.

కాన్ని మానాన్నగారు పెళ్ళి సంబంధం చూసి వుంచేరు. త్వరగా వచ్చేయమంటూ వుత్తరాల మీద వుత్తరాలు దంచి వ్రాసేస్తున్నారు. ఏం చేయను? పెట్టేబేడా కట్టేసి సరోజనాన్నగారితో వస్తానని చెప్పాను. ‘‘అప్పుడప్పుడు మాయింటికి వస్తుండు నాయనా! శుభంగ వెళ్ళిరా’’ అని అన్నారు. సరోజ చెమ్మగిల్లిన కళ్ళతో చిన్నగా నవ్వుతూ ‘‘మమ్మల్ని మఱచి పోకండేం మాస్టర్ సాహబ్! అప్పుడప్పుడు కటాక్షిస్తుండండి. ఈమాటు వచ్చేటప్పుడు గుమ్మడి పండులాంటి కొడుకుని యెత్తుకురండి’’ అంటూ వీడ్కోలిచ్చింది.

ఇప్పటికీ కూడా వారి లాలనపాలన మర్చిపోలేను.



విజయగోపాల్ ప్రొడక్షన్స్‌వారి ‘‘గంగా గౌరీ’’ సంవాదంలో గౌరీగా నటిస్తున్న జానకి

కారేజీల్లోగాని, సినీమా హాల్లోగాని ఎక్కడైనా అందమైన అమ్మాయి కన్పించి నావైపు చూసే సరికి సరోజ స్మృతి పథంలో మెరిసేది.

ఇదంతా తలంచుకొని ఓనాడు కథరూపంగ వ్రాసి ‘‘పత్రికకు’’ పంపిద్దామని అట్టేపెట్టి వుంచాను. ఓరోజున మా శ్రీమతి ఆకథ చదివి ఇట్టే బుద్ధమూతి పెట్టి ఆకాగితాలు గిరవాటు వేస్తూ యిలా అంది. ‘‘చాల్లెండి యిలాంటి చచ్చుకథలు వ్రాయమంటె ఎన్నైనా వ్రాస్తారు. ఎవరండీ ఆసరోజ! భోగందయి వుండాలిగాని అచ్చు సంసారులపిల్ల అలా ప్రవర్తించదు. వున్నవీ లేనివీ కల్పించి యెందుకండీ యిలా వ్రాయడం, గొప్ప పని చేసినట్లు! ఏముందీ కథలో?’’ అంటూ చప్పరించేసింది. ‘‘హా, చచ్చానురా భగవాన్! ఇహ యీవిడ రోజూ సత్యభామ అలుక అనుకరిస్తూ ఇదోవంక పెట్టి సాధిస్తూ వుంటుంది.’’ అని అనుకుని కుత్రిమ కోపం నటిస్తూ యిలా అన్నాను.

‘‘చాల్లే, నీ తెలివితేటలకు చాలా సంతోషించాంగానీ ముందా కాగితాలేరి యిటివ్వు. వాటి నిన్నెవరు చదవమన్నారు? చదువుగాక. చదివాక వెధవచచ్చు సలహాలు యెవరిమ్మన్నారు? శుభమల్లే నా తొలిరచన ప్రారంభిస్తే యేమిటీ అపశకునం మాటలూ! ఇందులో ఎంత స్వారస్యం వుందో ఆడది నీకేం తెల్సు! ప్రణయ జీవులకిది గీటురాయి. విరహవంతులకిది శిరోభూషణం! కళాశ్రేష్ఠులకిది ఆనందతునక. యువతీ యువకుల ప్రణయోద్దీపినియిది!’’ అంటూ నాకాగితాలు అందుకోబోయాను. కాని యేంలాభం! అప్పటికే నా చిన్నారి పాప ఆడుతూ ఆడుతూ వాటిని బరబరాచింపేసింది. దాంతో నాక్కోపం మరింత యెక్కువయింది. అనవలసిన మాటలు మరోమారు మా శ్రీమతితో అనేసి డ్రెస్సు వేసుకొని సరాసరి ‘‘నేషనల్ కేఫ్’కి బయలు దేరాను కాఫీ సేవించేటందుకి. ఏ ముహూర్తాన ఆరచనప్రారంభించానోగాని అది మొదలు యిప్పటి వరకూ వ్రేలమీద లెక్కపెట్ట గలిగే రచనలు తప్ప విరివిగా వ్రాయ వీలు చిక్కలేకపోయింది.

ఇకవుంటా శలవ్.

జై హింద్.